


విద్యార్థికి నగదు బహుమతి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని శ్రీసత్యసాయి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పొదిలాపు కావ్యశ్రీ వక్తృత్వ పోటీల్లో జిల్లాస్థాయి ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు ఆమెకు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్‌ను శుక్రవారం బహూకరించారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యాన పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో కావ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఆమెను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.



కావ్యశ్రీకి బహుమతిని అందజేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్



మందకొడిగా రబీ

వర్షాభావమే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రబీ పంటల సాగు మందకొడిగా సాగుతోంది. వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. ఇదేపరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తులతోపాటు రైతుల ఆదాయం తగ్గిపోనుంది. ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తున్నామంటున్న చిరుధాన్యాల సాగు కూడా అంతమాత్రంగానే ఉండడం గమనార్హం. వాస్తవానికి రబీ సీజన్ అక్టోబర్ నుంచే ప్రారంభమౌతుంది. అంతకు ముందు ఖరీఫ్ సీజన్‌లో కురిసిన హెచ్చుతగ్గు వర్షాల వల్ల వరి విస్తీర్ణం తగ్గింది. నాటిన వరి కూడా చాలా వరకు ఎండిపోయింది. ఈనేపథ్యంలో వరిలో అంతరపంటగా వేయాల్సిన పెసలు, మినుములు తదితరాలు నాటడం సాధ్యం కాలేదు. రబీ సీజన్ ఇప్పటికే రెండు నెలలు గడిచింది. డిసెంబర్‌తో ముగియనుంది. ఇప్పటికీ పంటల సాగు నత్తనడకనే సాగుతోంది. జిల్లాలో సుమారు పాతిక రకాల పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,72,710 ఎకరాలుగా అధికారులు గుర్తించారు. ఇందులో వరి, మొక్కజొన్న, రాగులు, పెసలు, మినుములు, చెరకు, నువ్వులు, వేరుశెనగ, కూరగాయలు, పలు రకాల పండ్లు సాగుకావాల్సి వుంది. గత ఏడాది సుమారు 1.60లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇప్పటి వరకు 6,390 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 2.21లక్షల ఎకరాలకు సాగునీటి వసతి ఉన్నట్టు అధికారిక లెక్కలు ఉన్నాయి. రబీలో సీజన్ నాటికీ ఈలెక్క గణనీయంగా తగ్గిపోతోంది. రబీ వరి సాధారణ సాగు 7,290 మాత్రమే కావడం ఇందుకు తార్కాణం. గత ఏడాది 2,155 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు నాట్లు పడలేదు. రబీలో అత్యధికంగా సాగవుతున్నది జొన్నలు, సాధారణ సాగు విస్తీర్ణం 53,495 ఎకరాలు కాగా, గత ఏడాది లక్ష్యానికి మించి 61,200 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 3,452 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. మొక్కజొన్న 3,875 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు ఒక్క ఎకరాలో కూడా నాటలేదు. నువ్వుల సాగు కూడా ప్రారంభం కాలేదు. మినుములు 2శాతం, పెసలు 3.30శాతం మాత్రమే సాగయ్యాయి. మిగిలిన పంటల సాగు మరీ అధ్వానంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్‌లో 87.3 మిల్లీమీటర్ల వర్షపులోటు నమోదు కాగా, నవంబర్‌లో ఇప్పటి వరకు 82.4 మి.మీ వర్షపాతం లోటు కనిపిస్తోంది. దీంతో రబీలోనూ రైతులకు నిరాశే ఎదురౌతోందని స్పష్టమౌతోంది.

జిల్లాలో 185 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జిల్లాలో 2023-24 ఖరీఫ్‌కు గానూ 185 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని, జిల్లాలో ధాన్యం పండించే అన్ని రైతు భరోసా కేంద్రాలను 185 ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి, ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్నట్లు చూసుకొని తమకు దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాల్సిందిగా కోరారు. ధాన్యం కొనుగోలులో దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. వ్యవసాయ శాఖ వారి ధాన్యం దిగుబడి అంచనాలకు అనుగుణంగా రైతుల సౌకర్యార్థం జిల్లాలోని 306 రైతు భరోసా కేంద్రాలను 185 ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేసి వాటిని ప్రొక్యూర్మెంట్ సహాయ ఏజన్సీలకు ట్యాగ్ చేసి ధాన్యం కొనుగోలు చేసే ఏర్పాట్లు చేయబడింది అన్నారు. కావునా రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి కోరారు.

మద్దతు ధరలు

సాధారణ రకం: క్వింటా రూ.2183

గ్రేడ్-ఎ రకం : క్వింటా రూ.2203

కంట్రోల్ రూమ్ నెంబర్లు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారం కొరకు దిగువ తెలిపిన కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 8.గంటల వరకు నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చును.

జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్ నంబరు, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబరు :
08963293037/7702003582
1800-42519671967

ఇవిఎంల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఇవిఎం) పనితీరు ప్రదర్శన (డిమానిస్ట్రేషన్)ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఇవిఎంలో ఓటు వేసి అది ఏ విధంగా నమోదైంది పరిశీలించారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఇవిఎం డిమానిస్ట్రేషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతోందనితెలిపారు. మొబైల్ ఇవిఎం డిమానిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇవిఎం డిమానిస్ట్రేషన్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఓటరు ఓటు వేసి టాన్ తనిఖీ చేసుకోవాలని ఆయన కోరారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఇతర అధికారులు తమ ఓటును వేసి పరిశీలించుకున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పాలన అధికారి ఆర్ ఉమామహేశ్వర రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




ఇవిఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి, డిఆర్ఒ

టెన్త్ ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి - పార్వతీపురం

పదో తరగతి ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పెంచిందని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 లో జరగబోయే టెన్త్ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థుల పరీక్ష ఫీజు, వొకేషనల్, మైగ్రేషన్ సర్టిఫికెట్ కొరకు ఫీజును ఈనెల 5లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. రూ.50 అపరాద రుసుంతో ఈనెల 10 వరకు, ఆ తర్వాత రూ.200 అపరాద రుసుంతో 12వరకు, ఆ తర్వాత రూ.500 అపరాద రుసుంతో ఈనెల 14లోగా ఫీజు చెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. మూడు సబ్జెక్ట్ ల కన్నా ఎక్కువ సబ్జెక్టులు రాయు విద్యార్థులు రూ.125 చెల్లించాలన్నారు. మూడు సబ్జెక్టు వరకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.80, వొకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలని తెలిపారు. ఏజ్ కాండోనేషన్ కోసం రూ.300 చెల్లించాలన్నారు. పట్టణాల్లో ఉండే ఎస్‌సి, ఎస్‌టి, బిసి రెగ్యులర్ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.24 వేలు, రూరల్‌లో అయితే రూ.20 వేలు మించని వారికి పరీక్ష ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. చెల్లించాల్సిన ఫీజులను www.bse.ap.gov.in వెబ్సైటులో స్కూల్ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలని తెలిపారు. సిఎఫ్ఎంఎస్‌లో బ్యాంకు చలానాలు అనుమతించడం జరగదని, ఏజ్ కాండోనేషన్ ఫీజును సిఎఫ్ఎంఎస్ చలనా ద్వారా చెల్లించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సూచనలు యూజర్ మాన్యువల్‌కు www.bse.ap.gov.in వెబ్సైట్‌ను సందర్శించాలని ఆ ప్రకటనలో తెలిపారు.



రీసర్వే ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డిఒ కె.హేమలత

20కి అర్బన్ రీసర్వే పూర్తి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో ఈనెల 20 నాటికి రీసర్వే పూర్తి చేయాలని ఆర్డీవో హేమలత అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆమె పట్టణంలో జరిగే అర్బన్ రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఆస్తి దారులు తమ ఆస్తులకు సంబంధించిన హక్కు పత్రాలను సచివాలయాలకు సమర్పించాలన్నారు. డిసెంబర్ 20 నాటికి పట్టణ రీసర్వే పూర్తి చేసి ఆస్తి హక్కుదారులకు జగనన్న శాశ్వత భూహక్కుపట్టాలను అందజేసే లక్ష్యంగా చేసుకోవాలని సూచించారు. కమిషనర్ రామఅప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేటు ఆస్తులకు సంబంధించి నిజ నిర్ధారణ జరుగుతుందని ఇచ్చి జరిగిందని గ్రౌండ్ వాలిడేషన్‌కు కావాల్సిన ఆస్తి ధ్రువీకరణ పత్రాలను హక్కుదారులు సచివాలయాలకు సమర్పించాలని తెలిపారు.

4న దుకాణాలకు వేలం

పార్వతీపురంటౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన గల మున్సిపల్ వాణిజ్య సముదాయంలో ఖాళీగా ఉన్న 22, 44, 46 షాప్‌లను ఈ నెల 4న ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించను న్నామని కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనాల్సిన వారు మున్సిపల్ కార్యాలయం పని చేయు వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జగన్నాథరావు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించడం ద్వారా హెచ్ఐవి - ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం నుండి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జిఒ హోంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల గ్లోబల్ హెల్త్ సెక్టారు స్ట్రాటజీ ద్వారా ముఖ్య సవాళ్లను అధిగమించడానికి గల అవకాశాల పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. "సమాజమే నడిపించాలి" శీర్షికన 2023 ప్రపంచ ఎయిడ్స్ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో సమగ్ర సలహా, పరీక్ష కేంద్రాలు ఐసిటి కేంద్రాలు, ప్రాథమిక, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసిటిసిలు తదితర హెచ్ఐవి, ఎయిడ్స్ పరీక్ష, సేవ, చికిత్సా సదుపాయాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం, ఈ వ్యాధిగ్రస్తులకు ఎఆర్‌టి కేంద్రాల్లో ఉచితంగా మందులు పంపిణీ జరుగుతోందని వివరించారు. జిల్లాలో గల హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు, లక్షిత గ్రూపులకు హెపటైటిస్ పరీక్షలు నిర్వహించి, హెపటైటిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 391 మందికి పింఛను అందుతుందన్నారు. విద్యాశాఖ ద్వారా ఎన్ఎస్ఎస్, సహకారంతో కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తూ యువతకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై సంపూర్ణ అవగాహన పెంచడంతో పాటు స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం జరుగుతోందని ఆయన అన్నారు. జిల్లాలో ఆరుగురు గర్భిణులకు హెచ్ఐవి ఉన్నట్లు గుర్తించామని, 76 సాధారణ కేసులున్నాయని ఆయన తెలిపారు. అవగానతో హెచ్ఐవి, ఎయిడ్స్‌ను పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఉందని, యువత ఇందులో ప్రధాన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా చేయాలని ఆయన అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లాలో గల కళాశాల విద్యార్థులకు, యువతకు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై జిల్లా స్థాయిలో క్విజ్, మారథాన్, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు, మంచి సేవలు అందించిన వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, కార్యకర్తలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ యాళ్ల వివేక్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ జిల్లా పర్యవేక్షకులు ఎస్.సాక్షి గోపాలరావు, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు జివి ఆర్ ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఈనెల 3న నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కవిత శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దినోత్సవం 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుండి ఐటిడిఎ గిరి మిత్ర సమావేశ మందిరంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె అన్నారు.

ఆసక్తి గల క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 15ఏళ్లు దాటిన ఆసక్తిగల స్త్రీ, పురుష క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో క్రీడాకారులు సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఆయా సచివాలయాల పరిధిలో సుమారు 278 మంది క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి కనపర్చుకొని సచివాలయంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

ఓటు హక్కును వినియోగించుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శుక్రవారం సీతంపేటలో ఇవిఎం యంత్రాల ద్వారా ఓటు ఎలా వేయ్యాలి అన్న దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఇవిఎం యంత్రాల ద్వారా ఓటు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇవిఎం యంత్రంలో ఓటు వేసిన అనంతరం మీరు వేసిన గుర్తుకే ఓటు నమోదయ్యేలా చూసుకోవచ్చున్నారు. ఈ సంధర్భంగా ప్రజలతో మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. సీతంపేటలో ప్రతిరోజు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీన్ని ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు. అనంతరం మండలంలోని గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన వాహనాన్ని పిఒ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ నరసింహమూర్తి, డిటి కుమారి, ఇతర రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా విధిగా నమోదు కావాలని కళాశాల ప్రిన్సిపల్ పైల శంకర్రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇంగ్లీష్ అధ్యాపకులు ధవళ నారాయణరావు పర్యవేక్షణలో 18ఏళ్లు నిండిన సుమారు 52 మంది విద్యార్థులు తమ ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తులు పూర్తి చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు కావాలని, అలాగే ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు తేజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, పౌర శాస్త్ర అధ్యాపకులు వెంకటేశ్వర్, చరిత్ర అధ్యాపకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీతంపేట : అవగాహన రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 2, 3 తేదీల్లో ఓటర్ల నమోదు, తనిఖీ కోసం కేటాయించిన బిఎల్‌ఒలు వారి పోలింగ్ కేంద్రాల్లో యూనిఫాం, ఐడి కార్డులను కలిగి ఉండాలని పాలకొండ ఆర్‌డిఒ ఎం.లావణ్య తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బిఎల్‌ఒలు, సూపర్వైజర్లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రాల గోడలపై సంబంధిత బిఎల్వోల పేర్లను రాసి ఉంచాలని అన్నారు. త్వరలో ప్రతి మండలానికి ఓటర్లను చైతన్యపరిచేందుకు మొబైల్ ఇవిఎం వ్యాన్లు రానున్నాయని, అందుకుగాను ప్రజలకు ముందస్తుగా తెలియపరచాలని అన్నారు. అలాగే సూపర్వైజర్లకు కేటాయించిన విధులను ఎప్పటికప్పుడు పైఅధికారులకు తెలియపర్చాలన్నారు. సమావేశంలో మండల తహశీల్దార్ జె.రాములమ్మ, డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజేంద్ర, ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్, ఎంఇఒ- 2 జనార్ధన్ నాయుడు, పిఆర్ ఎఇ మురళీధర్ రావు తదితరులు ఉన్నారు.

ఇవిఎంలపై బూత్ స్థాయిలో ఓటర్లకు అవగాహన

పార్వతీపురంరూరల్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై బూత్ స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పట్టణ ప్రాంత ప్రజలకు ప్రతిరోజు ఇవిఎంలపై అవగాహన కల్పిస్తామని, గ్రామాల్లో ఎండివి వాహనంతో ఇవిఎంలపై అవగాహన కార్యక్రమం చేపడతామని, నియోజకవర్గంలో 232 పోలింగ్ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం బిఎల్‌ఒలు, ఇతర సిబ్బంది ప్రతిరోజు దీనిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 7 వరకు అవగాహన కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ఓటర్లు, రాజకీయ నాయకులు ఈ అవగాహన కార్యక్రమాల్ని స్వదినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

5లోగా అంగన్వాడీలకు సరుకులివ్వాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎప్పటిలాగానే అంగన్‌వాడీ సరుకులు ప్రతి నెలా ఐదో తేదీలోగా పంపిణీ చేసేలా అనుమతి మంజూరు చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతికుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం నాయకులు ప్రాజెక్టు డైరెక్టర్ నూర్జహాన్‌రాణిని కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతినెలా 1 నుండి 5 వరకు, 16 నుండి 22 వరకు బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అయితే సమస్యల పరిష్కారం నిమిత్తం అంగన్‌వాడీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన కార్యాచరణ మేరకు ఈనెల 8నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొనన్నందున, సమ్మెను విచ్ఛన్నం చేయాలని ఉద్దేశంతో సదరు తేదీలను ఈనెల 8 నుంచి 22వరకు మార్చడం అన్యాయమని అన్నారు. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నందున ఈనెల సరుకులను మాన్యువల్ పద్ధతిలో అందించేందుకు అధికారులు అనుమతించాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో సెక్టార్ లీడర్లు రాజేశ్వరి, గౌరీమణి, అలివేణి, జ్యోతి పాల్గొన్నారు.

పాలకొండ : ఈనెల 8నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బుక్కూరు 1,2 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది నల్ల రిబ్బన్లతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ, టి.దివ్య, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

సీతానగరం : మండలంలోని పెదబోగిలి పంచాయతీ అప్పయ్యపేట, సీతానగరం, బుడ్డిపేట గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ఇఒ జి వెంకటరావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు సునీత, శైలజ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మె నోటీసు అందజేశామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, మేరీ, రమాదేవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించి, తమ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి రాయపల్లి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో భవన నిర్మాణం కార్మిక సంఘం మండల కార్యదర్శి పైల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదట భవన నిర్మాణ కార్మికుల బతుకులు నాశనం చేసే ఇసుక విధానం తీసుకొచ్చారని విమర్శించారు. కరోనా సమయంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అనేక అర్థాకలితో ఇబ్బందులు పడినా కనీసం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా రాజశేఖర్‌రెడ్డి భవనిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ప్రవేశపెడితే జగన్మోహన్ రెడ్డి ఆబోర్డును రద్దు చేయడం అత్యంత దారుణమని అన్నారు. సంక్షేమ బోర్డు రద్దు వల్ల భవన నిర్మాణ కార్మికులు అనేక సంక్షేమ పథకాలు కోల్పోవచ్చిన పరిస్థితి వచ్చింది. నాలుగున్నరేళ్లయినా ఇప్పటికీ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆలోచించడం లేదన్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, పిల్లలకు స్కాలర్‌షిప్ గుర్తింపు కార్డులు పెండింగ్ క్లైములు ఇన్సూరెన్స్ ఇఎస్ఐ వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బండి కోటి, చింతాడ కైలాసం, శ్రీను, మురళి, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాము

ఆడుదాం ఆంధ్రా లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతంపేట

ఆడుదాం ఆంధ్ర లోగోను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పేరుతో ఈనెల 15 నుంచి సచివాలయ, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయిల్లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, కావున యువత అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానందం, పీడీ, పిఇటిలు గాంధీ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి విశ్వబ్రాహ్మణుల సమస్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విశ్వబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీదేవి కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్ర వారం నిర్వహించిన ఆత్మీయ సమావేశం జరిగింది. తమ సామాజికవర్గంలోని దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, తమకు తప్పక పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో ఉన్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం కుల పెద్దలంతా కలిసి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌మెన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు ఎం.వెంకట్రావు, సంఘం అధ్యక్షులు కంచరాపు మోహనరావు, ఉపాధ్యక్షులు, కుల పెద్దలు శంకరరావు మాస్టారు, ఇతర పెద్దలు పాల్గొన్నారు.

లక్ష్యాలు అధిగమించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గృహ నిర్మాణంలో లక్ష్యాలు అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ ఇంజనీరింగ్ సహాయకులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 217 గృహాలు జనవరి 24 నాటికి మెగా కంప్లేషన్ కార్యక్రమంలో భాగంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా చేయాలన్నారు. ప్రభుత్వ ఆశయానికి ప్రతి ఒక్కరూ లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చూపినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సూచించారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వావిలపల్లి వినోద్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉమా, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలస, బూర్జలో రేషన్ బియ్యం పంపిణీని ఆర్‌డిఒ కె.హేమలత శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం భోజనం నిర్వహణకు అందిస్తున్న బియ్యాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రంగా అందజేయాలని, ఏఏ సరుకులు ఇస్తున్నారనే తెలుసుకోవడానికి లబ్ధిదారులకు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నగిరెడ్డి శ్రీనివాసరావుతో పాటు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పిఎంఎవై ఇళ్ల పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

పిఎంఎవై ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎ.గీతాంజలి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌసింగ్ మెగా డ్రైవ్ నిర్వహించాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. గృహాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పిఎంఎవై పథకం లబ్ధిదారులకు బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పాపారావు, పిఆర్ జెఇ కిరణ్ కుమార్, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ట్రాన్స్‌కో ఎఇ నీలిమ పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి హేమాక్షి

పాపంవలసలో ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పాపంవలసలో బూర్జ ఆయుర్వేదిక్ వైద్యాధికారి బి.హేమాక్షి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేదిక్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదిక్ మందుల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు జ్వరం, దగ్గుతో పాటు వివిధ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులను అందిస్తున్నామన్నారు. రోగులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రోగులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ సొసైటీ సంస్థ కార్యదర్శి గౌస్

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో గల గాంధీనగర్ కాలనీకి చెందిన వృద్ధులకు, ఒంటరి మహిళలకు ఎస్ సొసైటీ సంస్థ కార్యదర్శి షేక్ గౌస్ శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కొందరు దాతల సహకారంతో వీటిని వృద్ధులకు, ఒంటరి మహిళలకు పంపిణీ చేస్తున్నామన్నారు. అంతేకాక గిరిజన గ్రామాల్లో కూడా పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ జాయింట్ సెక్రెటరీ వి.లక్ష్మి స్థానికులు కె.భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -గరుగుబిల్లి


మండలంలోని నాగూరులో గల శ్రీచంద్రశేఖరస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆలయ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి కూర్మినాయుడు అన్నారు. చంద్రశేఖరస్వామి ఆలయ చైర్మన్ గా కూర్మినాయుడును నియమిస్తూ విశాఖపట్నం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ఉత్తర్వులు జారీ చేయడంతో దేవాదాయశాఖ అధికారి మరిశర్ల బలరామనాయుడు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కూర్మినాయుడు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, దాతల సహకారంతో తనవంతు కృషి చేస్తానన్నారు. తనను ఆలయ చైర్మన్‌గా నియమించి నందుకు గాను ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపిపి ఉరిటి రామారావు, జిల్లా పరిషత్ చైర్మన్ బాపూజీనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష వైసిపి నాయకులు కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకట నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అశ్రద్ధ వహించొద్దని మున్సిపల్ కమిషనర్ టి.జయరాం ఆదేశించారు. శుక్రవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు, శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రిలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు పారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసినందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు



ఎయిడ్స్ లోగో ఆకృతిలో కూర్చున్న పాలకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు

ప్రజాశక్తి - కురుపాం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సందీప్ కుమార్, వైడిఒ నెట్వర్క్ అవుట్ రిచ్ వర్కర్ ఎ.గీతారాణి, వైద్య సిబ్బంది ప్యాలెస్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కురుపాం కెటిఆర్ కళాశాల కరస్పాండెంట్ కె.తిరుపతిరావు తమ విద్యార్థులతో బస్టాండ్ వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించి ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎయిడ్స్ డే, రెడ్ రిబ్బన్ ఆకారంలో కూర్చుని అందరిని ఆకట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ పైల శంకర్రావు విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, నారాయణరావు, శివానంద, శ్రీనివాసరావు, మాణిక్యరావు నాగభూషణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

సీతానగరం :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కాలేజీ నుంచి బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వంటి వ్యాధి కాదని అంటించుకునే వ్యాధిని నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డివిజివిఎస్ త్రినాధ్, ఎన్ఎస్ఎస్ పిఒ డి.రామకృష్ణ, వినోద్, రామారావు, అధ్యాపకులు ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట :మండలంలోని ధోనుబాయి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండగొర్రె సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల నుండి మెయిన్ రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకనాయుడు, హెల్త్ సూపర్వైజర్ రామచంద్రరావు, పిడిలు ఆర్‌సి రెడ్డి, వెంకట్రావు, ఉపాధ్యాయులు విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎయిడ్స్ డే, రెడ్ రిబ్బన్ ఆకారంలో కూర్చుని అందరిని ఆకట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ పైల శంకర్రావు విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తేజేశ్వరరావు, గోవిందరావు, నారాయణరావు, శివానంద, శ్రీనివాసరావు, మాణిక్యరావు నాగభూషణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

సీతానగరం :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కాలేజీ నుంచి బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వంటి వ్యాధి కాదని అంటించుకునే వ్యాధిని నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డివిజివిఎస్ త్రినాధ్, ఎన్ఎస్ఎస్ పిఒ డి.రామకృష్ణ, వినోద్, రామారావు, అధ్యాపకులు ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన వైద్య, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ అనిల్ కుమార్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నీడ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మహేష్, రామకష్ణ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ జె.రాములమ్మ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వ్యాధి వల్ల వచ్చే అనర్థాలు గుర్తించాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే నష్టాలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీ వరం, ఎన్ ఎస్ ఎస్ పిఒ త్రినాధ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

తాడికొండలో :...

మండలంలోని తాడికొండలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బుద్దేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు రత్న ప్రసాద్, ప్రకాష్, లక్ష్మణ, బుజ్జి, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని ప్రపంచ ఎయిడ్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిరాం డిగ్రీ కళాశాల ర్యాలీ

పార్వతీపురం : స్థానిక సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎయిడ్స్ నిర్మూలలపై అవగాహన ర్యాలీచేశారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 కోఆర్డినేటర్లు డి దేవి, తిరుపతిరావు ఆధ్వర్యంలో బైపాస్ లోనున్న డిగ్రీ కళాశాల నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం ఆ కళాశాల ప్రిన్సిపల్ జి శ్రీధర్ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలన కై ప్రతి ఒక్కరు బాధ్యతని.ఎయిడ్స్ రహిత ప్రపంచాన్ని నిర్మించే దానిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనికోరారు.ఈ ర్యాలీలోసాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





గుమ్మలక్ష్మీపురం : తాడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది; పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న సాయిరాం కాలేజీ విద్యార్థులు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రైతుల పక్షపాతం

ప్రజాశక్తి - బలిజిపేట

తమ ప్రభుత్వం రైతు పక్షపాతని, వీరిని అన్ని విధాలా ఆదుకొని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని అరసాడలో గల రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలును శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో గల 56 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వ మద్దతు ధర సాధారణ రకం ధాన్యం కింటాకు రూ. 2183, ఏ గ్రేడ్ రకం రూ. 2203కు ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు తెలిపారు. కావున రైతులు మధ్యవర్తిని కూడా ఆశ్రయించ కుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే అమ్ముకోవాలని సూచించారు. అనంతరం ధాన్యం బస్తాల ట్రాక్టర్ల లోడ్లను జండా ఊపి రైస్ మిల్ కేంద్రాలకు పంపించారు. కార్యక్రమంలో ఎంపిపి జి.నాగమణి, జెడ్‌పిటిసి ఎ.రవికుమార్, మండల వైసిపి అధ్యక్షులు పి.మురళీకృష్ణ, ఎఒ ఎ.శ్రావణ్ కుమార్, తహశీల్దార్ పి.అప్పలరాజు, ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్, మూడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్, పాల రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు గుల్ల ప్రభావతి, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పాల్గొన్నారు.

మహిళా హక్కులు మానవ హక్కులుగా చూడాలి

ప్రజాశక్తి - మక్కువ

దేశవ్యాప్తంగా జరుగుతున్న మహిళలపై దాడులను అరికట్టాలని, మహిళల హక్కులను మానవ హక్కులుగా పరిగణించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా డిమాండ్ చేశాయి. నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా మండలం లో శుక్రవారం ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మంగ అధ్యక్షతన జరిగిన సదస్సులో వక్తలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, ప్రతి విషయాన్ని ఛాలెంజిగా తీసుకొని తనను తాను నిరూపించుకోవాలని అన్నారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ సమాజంలో మహిళాభివృద్ధికి, మహిళా విద్యావశ్యకతకు బాటలు వేసిన వ్యక్తి గురజాడ అప్పారావు అని అన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలపై అఘాయిత్యాలు విద్యార్థులపై వేధింపులు ఎక్కువయ్యాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. దీనికి నిదర్శనం మణిపూర్, హత్రాస్ లాంటి చోట మహిళలపై జరిగిన దాడులను అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి మహిళల అభివృద్ధికి కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఎం.గంగులు మాట్లాడారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. హెచ్‌సి, విద్యార్థి సంఘం నాయకులు టి.ప్రభాకర్, కాలేజీ అధ్యాపకులు వై రాంబాబు సాయి పాల్గొన్నారు .

సచివాలయ, ఆర్‌బికె భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశీలలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన సచివాలయం రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను శుక్రవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు కార్యకర్తలతో కలిసి వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఇంతవరకు రూ.24.58 కోట్లు మేర ప్రత్యక్షంగా, పరోక్షంగా, స్థానిక అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు వెచ్చించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపి బి.రవికుమార్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, స్థానిక సర్పంచ్ సంపంగి జగదీష్, మండల సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపిడిఒ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకే ప్రాధాన్యత

ప్రజాశక్తి - సాలూరు

గడిచిన నాలుగున్నర ఏళ్లలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు చెప్పారు. పట్టణంలోని 23,24 వార్డుల్లో జగన్ ఎందుకు కావాలి అన్న కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి వార్డుల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ పున్నాన మోహన్ రావు, నాయకులు తాడ్డి రమణ, మేకల శంకరరావు, 24వార్డు కౌన్సిలర్ బి.హైమవతి, బాలకష్ణ పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలని కార్యక్రమం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డిస్ప్లే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ సుదర్శనరావు, ఎంపిటిసి సభ్యులు పోరెడ్డి వెంకట నాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రి లీలాప్రసాద్, పిఎసిఎస్ డైరెక్టర్లు రంభ శ్రీనివాసరావు, భోగి మాణిక్య చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి టివిఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ

మండల విద్యా శాఖాధికారి కె.సోంబాబుతో నేతృత్వంలో ఐదుగురు పర్యవేక్షక బృందం మండలంలోని వోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించింది. పాఠశాల అసెంబ్లీ సమయానికే వచ్చి ఉదయం పూటంతా పర్యవేక్షణ జరిపి అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. తాము చేపట్టిన తనిఖీలో అంశాలను ఉపాధ్యాయులతో సమీక్షించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సూచనలను, సమీక్ష అంశాలను విని పూర్తి అవగాహన పొందారు. పాఠశాల పనితీరు మరింత అభివృద్ధికై తగు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. రాష్ట్ర విద్యా సంచాలకులు విడుదల చేసిన ఎపిసోడ్స్‌ను విని ఆచరించాలన్నారు. విద్యార్థులు రాస్తున్న నోట్ బుక్స్, వర్క్ బుక్స్‌లోని తప్పొప్పులను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. తప్పిదం గుర్తిస్తే, ఆ చోటనే సరైన పదాన్ని రాయాలన్నారు. ప్రాజెక్ట్ వర్క్‌ల పట్ల శ్రద్ధ వహించి విద్యార్థులలో పరిశీలనా దృక్పథం, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల పాఠ్యపథక రచన, టీచర్ డైరీ, టీచింగ్ నోట్స్, తర్ల్, లిప్ రికార్డులను పరిశీలించారు.తొలుత అన్ని తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. వారి ప్రతిభను పరీక్షిస్తూ ప్రశ్నించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. పరిశీలనలో కమిటీ సభ్యులు సి.హెచ్.సోమేశ్వరరావు, బి.సంగంనాయుడు, ఎన్.అరుణ్ కుమార్, బౌరోతు మల్లేశ్వరరావు ఉన్నారు.

పనికి తగ్గ వేతనం పొందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి పనుల్లో పాల్గొన్న ప్రతి వేతనదారుడు పనికి తగ్గ కనీస వేతనం రోజుకు రూ.250 పొందాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి వేతనదారులకు సూచించారు. మండలంలోని వండువ గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ చట్టం ద్వారా ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గృహ నిర్మాణాలు, చెరువులు, సిసి రోడ్లు, పంట కాలువలు తదితర 48 రకాల పనులకు సంబంధించి రూ.కోటి 25 లక్షలతో వండువ గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. వేతనదారులు రెండు పూటలు పనిలో పాల్గొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తద్వారా గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. గత ఏడాది మండలంలో 23 ఎకరాలకు గానూ జీడి, మామిడి మొక్కలు పంపిణీ చేశామని, ఆసక్తిగల వారు మొక్కలు కావాలని దరఖాస్తు చేసుకుంటే మొక్కలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఇటీవల ఆడారు, తూడి గ్రామాలకు సంబంధించి డీకే పట్టాలు పంపిణీ చేశామని, మొక్కలు కావాలంటే ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వీరఘట్టం, చిదిమి, నీలంపేట గ్రామ రహదారులను ఉపాధి హామీ చట్టం ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఎపిఒ సత్యంనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వండవ, ఆడారు గ్రామ సర్పంచులు ఎం కళ్యాణి, నీలం సుధారాణి- గణపతి నాయుడు, ఎం గోవిందరావు , ఇంజనీరింగ్ కన్సల్ట్ , టెక్నికల్ సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

అంతర్ పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అంతర్ పంటలు, పలు పంటలు వల్ల ఆరోగ్యంతో పాటు అధిక ఆదాయం లభిస్తుందని జీవ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రోబోద్ అన్నారు. నాబార్డ్ సహకారంతో, జట్టు సంస్థ పర్యవేక్షణలో మాతోట జీవ కార్యక్రమంలో భాగంగా మండలం లోని రాయగడజమ్ములో శుక్రవారం ఫార్మ్ ఫీల్డ్ డే (వ్యవసాయ క్షేత్ర పరిశీలన) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీవ రైతులు, ఇతర రైతులు, పాఠశాల విద్యార్థులతో జీవ రైతు కీల్లక జానకి క్షేత్రంలో సాగవుతున్న టమాటా, వంగ, మిరప, ముల్లంగి, బంతి, చిక్కుడు, బెండ, కర్రపెండలం, బీట్రూట్, తోటకూర, గోంగూర, జొన్న తదితర ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు వేసుకోవడం వల్ల ఆదాయంతో పాటు, మొక్కల్లో జీవ వైవిధ్యం పెరుగుతుందని అన్నారు. మరో వైపు పురుగులు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం ఉంటాయని, భూమిలో సేంద్రీయ కర్బను శాతం పెరుగుతుందని తెలిపారు. ఏ విధంగా భూమిని సారవంతం చేసుకోవాలి, ఏ విధంగా ఆరోగ్యంగా ఉండాలనేది ఆలోచన సరళి పెరుగుతుందన్నారు. ఈ విధమైన పంటలు ప్రతి రైతు పండించుకోవాలని, పైలెట్ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకొని ఇతర రైతులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మా తోట జీవ కమిటీ సభ్యులు పువ్వుల లచ్చన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిక రామచంద్రారావు, వివిఎ పి.శ్రావణి, కోఆర్డినేటర్ జి.మురళీమోహన్, రైతులు పి.విజయ, పి.లలిత, కామేశ్వరరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు,

గొప్పలు చెప్పడం కాదు... అభివృద్ధి చూపించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాంలో ఇటీవల నిర్వహించిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర సమావేశంలో వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు తాము చెప్పిన గొప్పలకు అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని అరుకు పార్లమెంట్ టిడిపి ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ప్రశ్నించారు. పూర్ణపాడు లాబేసు వంతెన పూర్తి చేయలేకపోయారని, గిరిజన ప్రాంతంలో రోగులకు డోలీమోతలు తప్పడం లేదని ఎద్దేవా చేశారు. గరుగుబిల్లి, జిఎంవలస, కొమరాడ, కురుపాం మండలాల్లో ఏనుగులు సంచరిస్తూ మనుషుల ప్రాణాలు తీయడమే కాకుండా లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలను ధ్వంసం చేస్తున్నాయని కనీసం ఏనుగులను అరణ్యాలకు తరలించే ప్రయత్నం అధికార పార్టీ నాయకులు చేయడం లేదన్నారు. సమస్యలతో నియోజకవర్గ ప్రజలు సతమతమవుతుంటే ఇవి ఏమీ మాట్లాడకుండా అభివృద్ధి మొత్తం మేమే చేశామని ఉపన్యాసాలు ఇవ్వడం సరికాదన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజా పంపిణీ వ్యవస్థకు వినియోగించాల్సిన ఎండియు వాహనాల్లో ప్రజలను తరలించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు,. నాలుగున్నరేళ్లలో సాధించలేని అభివృద్ధి ఇప్పుడు సాధించేది ఏమీ లేదన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దింటి కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని పెద్దూరులో పిఎంఇజిపి పథకంలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మంజూరు చేసిన వరి నూర్పుడు యంత్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ దళాయివలస గ్రామైక్యసంఘం ఆధ్వర్యంలో వెల్డింగ్ యూనిట్‌ను మంజూరు చేశామన్నారు. అలాగే సుంకి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మిఠాయి దుకాణం ఏర్పాటుకు రూ.5లక్షలు రుణ సౌకర్యం మంజూరు చేశామన్నారు. గొట్టివలసలో టైలరింగ్ యూనిట్‌ను గ్రామైక్య ఆధ్వర్యంలో మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో డిపిఎం ప్రవీణ్ కుమార్, ఎపిఎం పి.అప్పలనాయుడు, సిసిలు చందాన తిరుపతిరావు, వి.లక్ష్మణరావు, కింజగి కష్ణ, బొంగు రామినాయుడు, చింతాడ ప్రసాద్, కొప్పర రమేష్, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు నిర్మల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల గాన కచేరి కార్యక్రమానికి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన, ఎల్విన్‌పేట ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పెద్దింటి నిర్మల్ కుమార్‌కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈనెల 16,17న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుద్దాల కన్వెన్షన్ హాలులో 30 గంటల పాటు నాన్‌స్టాప్‌గా సాగే తెలుగు గాన కచేరి కార్యక్రమానికి తనను ఆహ్వానించి భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందని నిర్మల్ తెలిపారు. ఈ మేరకు ఏజెన్సీ ప్రాంత కవులు దేవానంద్, గుమ్మ గోపాల్, ఉమాకవి, రౌతు వాసు, బాలకష్ణ, హరిప్రసాద్, వైస్‌ఎంపిపి నిమ్మక శేఖర్, గుమ్మలక్ష్మీపురం సర్పంచి బి.గౌరీ శంకరరావు అభినందించారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - సాలూరు



తీవ్రంగా గాయపడ్డ ఉపేంద్ర

పట్టణంలోని జాతీయ రహదారిపై ముత్యాలమ్మ గుడి ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని చింతల వీధికి చెందిన చెందిన దాసరి ఉపేంద్ర (20)తో పాటు అతని స్నేహితులు చంద్రశేఖర్, లీలా ప్రసాద్ మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పట్టణం లోని ముత్యాలమ్మ గుడి సమీపంలో ఆగివున్న లారీని ఢోకొట్టారు. వీరు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. కాలేజీ విడిచిపెట్టిన అనంతరం వీరు ముగ్గురు మోటార్ సైకిల్ పై పట్టణంలోకి వెళ్తూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో ఉపేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. చంద్రశేఖర్, లీలా ప్రసాద్‌కు కూడా తీవ్ర గాయాలవడంతో విశాఖపట్నం కెజిహెచ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఉపేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ సంఘటన పై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హుండీ చోరీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణ శివారు నారాయణ స్కూల్ సమీపాన గల శ్రీపశుపతినాథ్ శివాలయంలో గురువారం రాత్రి దొంగలు హుండీ ఎత్తుకు వెళ్లారు. అయితే ఈ ఆలయంలో దొంగలు హుండీ ఎత్తుకెళడం ఇది మూడోశారని స్థానికులు తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎఎస్ఐ శ్రీహరి తెలిపారు. సుమారు రూ.25 వేల వరకు నగదు దొంగతనం జరిగిందని పోలీసులు అంచనా వేశారు.